
Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
18-10-2025

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 313 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శనివారం WWW.EPAPER.MAHAADAILY.COM



## స్థానిక ఎన్నికలెప్పుడు?

### రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
### రెండు వారాల్లో తేదీలు చెబుతామన్న ప్రభుత్వం

**హైదరాబాద్, మహా** : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఉత్కంఠ వాతావరణం కొనసాగుతూనే ఉంది. మొన్నటికి మొన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికల నిర్వహణకు ముందుకు వచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న చర్చోప చర్చలు కొట్టకేలకు హైకోర్టు మెట్లెక్కా యి. ఈ క్రమంలో శుక్రవారం తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణ పై కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొంతకాలంగా కొనసాగుతూ వస్తున్న పరిణామాలపై తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ దాఖలైంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### భారత్ ఇప్పుడు అన్‌స్టాపబుల్



- ఉగ్రదాడుల తర్వాత ఎదురుదాడులే
- ప్రధాని మోదీ హెచ్చరిక

02


### మీరు దేవుడు సామీ



- అక్షరాలా 5000..
- మరో బిడ్డకు ప్రాణం పోసిన మహేష్ బాబు

02

### దండుకున్న దండుపాళ్యమే బీఆర్ఎస్



- క్యాబినెట్‌లో రాద్ధాంతం జరిగిందని ఆయన నిరూపించగలరా?
- మాజీ మంత్రి హరీశ్ కు మంత్రి సీతక్క సవాల్

02


# ఇండియాలో నెంబర్ వన్ హైదరాబాదే

### గ్లోబల్ కంపెనీలకు హైదరాబాదే కేరాఫ్

**10 రోజులకు ఒక కొత్త జీసీసీ ఏర్పాటు**

హైదరాబాద్‌కు అమెరికా కంపెనీల క్యూ

మౌలిక సదుపాయాలకు తోడు ప్రభుత్వ మద్దతు



గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించడంలో హైదరాబాద్ ఇండియాలోనే నెంబర్ వన్ గా ఉంది. హైదరాబాద్ లోని జీసీసీలలో 3లక్షల మందికి పైగా ఐటీ నిపుణులు పనిచేస్తున్నారు. సగటున ఒక్క జీసీసీకి వేయిమందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయి. హైదరాబాద్ లో పదిరోజులకో కొత్త జీసీసీ ఏర్పాటవుతుండగా, ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3,200 జీసీసీలు ఉంటే.. అందులో 1700 కేంద్రాలు భారత్‌లోనే ఏర్పాటయ్యాయి. జీసీసీలలో హైదరాబాద్ వాటా 40 శాతం కాగా, తర్వాత స్థానంలో బెంగుళూరు 33శాతం తో ఉంది. అమెరికా కంపెనీలు ప్రధానంగా హైదరాబాద్ కు క్యూ కడుతున్నాయి. ఇతర మెట్రో సిటీలతో పోలిస్తే వ్యయాలు తక్కువ కావడం, సాంకేతికత సహా సాంకేతికేత పారిశ్రామిక రంగాలు విస్తరించి ఉండటం, నిపుణులు అందుబాటులో ఉండడం, వాతావరణం హైదరాబాద్‌కు ప్రధాన సానుకూలతలుగా మారినట్లు ఎక్స్‌ఫీనో నివేదిక పేర్కొంది. భాగ్యనగరంలోని హైటెక్‌సిటీ, ఫినాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, మదాపూర్ ప్రాంతాల్లో జీసీసీలు ఎక్కువగా ఉన్నాయి. భవిష్యత్తులో జీసీసీ కేంద్రాలకు హైదరాబాద్ హబ్‌గా మారి తెలంగాణ రాష్ట్రం వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకునేందుకు దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. - మహా, హైదరాబాద్

వివరాలు 3లో

03

## పత్తి ఉత్పత్తిలో మనమే టాప్

### దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్

కేంద్రం ప్రశంసలు..వాణిజ్యరాష్ట్రాలను దాటి ముందుకు

## దేశంలోనే రిచెస్ట్ జిల్లాగా రంగారెడ్డి

### ఇండియా నెంబర్ వన్

వివరాలు 3లో



### బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు రాష్ట్ర బంద్

- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని రాజకీయపక్షాల మద్దతు
- 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- కవితను కలిసిన బీసీ జేఏసీ.. బంద్ కు మద్దతు

వివరాలు 2లో

### చేతికి పతంగి

- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు ఎంఐఎం మద్దతు
- బీఆర్ఎస్ ఓటు బీజేపీకి పోయింది: అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్య

వివరాలు 2లో



### బంగారం లక్షన్నర రేట్లు.. పైపైకి

**హైదరాబాద్, మహా** : బంగారం ధర రోజురోజుకు విపరీతంగా పెరుగుతుంది. సామాన్యులు అటువైపు కూడా చూడలేని పరిస్థితిలు నెలకొన్నాయి. అంతేకాకుండా సంపన్నులను సైతం బంగారం ధరలు వణికిస్తున్నాయి. దీపావళి పండుగ వరకే తులం బంగారం ధర లక్షన్నర అవుతుందని అంచనా వేస్తున్నారు.

మిగతా 2లో



### విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్

- 2026 జూన్ నుంచి అమలుకు సర్కార్ శ్రీకారం
- ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి
- నర్సరీ - 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి
- విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

వివరాలు 2లో



## ఒకేసారి 208 మంది మావోయిస్టులు

### మావోయిస్టు ఉద్యమ చరిత్రలో అతిపెద్ద లొంగుబాటు

జనజీవన ప్రవంతిలోకి ఆశన్న

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగదల్‌పుర్‌లో లొంగిపోయిన మావోయిస్టులు

**మహా, భద్రాచలం:** మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద లొంగుబాటు. అతిపెద్ద ఆయుధాల అప్పగింత. ఆపరేషన్ కరూర్ తర్వాత అగ్రనేతలంతా నెత్తురోడుతున్న వేళ.. ఉద్యమంలో మరో మలుపు. మావోయిస్టు అగ్రనేత, కేంద్రకమిటీ సభ్యుడు ఆశన్న అలియాస్ రూపేశ్ సహా 208 మంది నక్సలైట్లు లొంగిపోయారు. బస్తర్ జిల్లాలోని జగ్‌దల్‌పూర్‌లో నిర్వహించిన నక్సలైట్ల లొంగుబాటు కార్యక్రమంలో వారంతా జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. మావోయిస్టు చరిత్రలోనే ఇది అతిపెద్ద లొంగుబాటుగా నిలిచింది. లొంగిపోయిన తర్వాత మొత్తం 153 ఆయుధాలు అప్పగించినట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది.

మిగతా 2లో

### అట్టహాసంగా నవీన్ యాదవ్ నామినేషన్


హాజరైన మంత్రులు, పొన్నం, వివేక్, ఎంపీ అనిల్, మేయర్ గద్వాల

నవీన్ యాదవ్‌కు ఎంపీ అసద్ మద్దతు

వివరాలు 2లో







# బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు రాష్ట్ర బంద్

- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని రాజకీయపక్షాల మద్దతు
- 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- కవితను కలిసిన బీసీ జేఏసీ.. బంద్ కు మద్దతు

**హైదరాబాద్, మహా :** బీసీ రిజర్వేషన్ల సాధనకోసం, బీసీ జస్టిస్ అంటూ శనివారం రాష్ట్ర బంద్ కు బీసీ జేఏసీ పిలుపునివ్వగా, అన్ని రాజకీయపార్టీలు మద్దతు పలికాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సహా అన్ని పార్టీలు బంద్ కు మద్దతు ప్రకటించాయి. బీసీల న్యాయమైన డిమాండ్ ను ఆమోదించాలని, ఈసెగ ఢిల్లీకి తగలాలని.. రాష్ట్రపతి, గవర్నర్ వద్ద ఉన్న బిల్లులు ఆమోదించాలని కోరారు. హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ ప్రభుత్వ బిల్లులు తిరస్కరణకు గురైన నేపథ్యంలో బీసీ సంఘాలు 42 శాతం స్థానికసంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కోసం బీసీసంఘాలు ఉద్యమబాట పట్టాయి. బీసీల సత్తా చాటుతామని నేతలు ఎంపీ ఆర్. క్రిష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంఘాలు ఉద్యమిస్తున్నాయి. శనివారం జరిగే బంద్ లో అన్ని రాజకీయపార్టీలు పాల్గొనడంతో పాటు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకటి శ్రీహరి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సహా నేతలు రోడ్లపైకి రానున్నారు. రాష్ట్ర బంద్ కు సహకరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కాగా శుక్రవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి జాగ్రుతి మద్దతును బీసీ జేఏసీ కోరగా, కవిత మద్దతు ప్రకటించారు.

# ఒకేసారి 208 మంది మావోయిస్టులు

(మొదటిపేజీ తరువాయి)

వాటిలో 19 ఏకే47లు, పదిహేడు ఎస్ ఎల్ ఆర్, ఇరవైమూడు ఇన్సాస్ రైఫిళ్లతో పాటు ముప్పై ఆరు 303 రైఫిళ్లు, 41 బోర్ గన్లు, పదకొండు బీజీఎల్ లాంచర్లు, ఒక పిస్టల్ ఉన్నాయి. రెండ్రోజుల క్రితం మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి 60 మంది అనుచర నక్సలైట్లతో కలిసి మహారాష్ట్రలోని గడ్చిరోలీలో సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఎదుట ప్రధాన స్రవంతిలో కలిసిపోయారు. ఈ నేపథ్యంలో తాము కూడా లొంగిపోతున్నట్లు ఆశన్న ప్రకటించారు. ప్రస్తుతం జనజీవన స్రవంతిలో కలిసిపోయిన 208 మందిలో మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత సహా 100 మంది మావోయిస్టులు ఉన్నారు. ఇద్దరు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, 15 మంది డివిజనల్ కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లొంగుబాటుతో అబూజ్ మడ్ అడవుల్లో ఎక్కువ భాగం నక్సల్స్ ప్రభావం నుంచి విముక్తి పొందిందని అధికారులు పేర్కొన్నారు. ఉత్తర బస్తర్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న రెడ్ టెర్రర్‌కు ఇదొక ముగింపని తెలిపారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని తుదిముట్టిస్తామని హోంమంత్రి ఇదివరకే ప్రకటించారు. ఆపరేషన్ కగార్ చేపట్టి విస్తృతంగా కూబింగ్ చర్యలు నిర్వహించారు. మావోలు ఆయుధాలు వదిలి లొంగిపోవాలని, లేదంటే వారికి భద్రతా బలగాలు సరియైన సమాధానం చెబుతాయన్నారు.



**లొంగిపోయిన వారిలో వివిధ కేడర్లకు చెందినవారు**

లొంగిపోయిన వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఒకరు కేంద్ర కమిటీ సభ్యుడు, నలుగురు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 21 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 61 మంది ఏరియా కమిటీ సభ్యులు, 98 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. మిగిలిన 22 మంది ఇతర కేడర్లకు సంబంధించిన వారున్నారు. ఈ అతిపెద్ద లొంగుబాటుతో ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి ప్రయత్నాలు వేగవంతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

**లొంగినవారిని స్వాగతిస్తాం- ఛత్తీస్ గడ్ సీఎం**

మావోల లొంగుబాటు గురించి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి మీడియాతో మాట్లాడారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసే వారిని ప్రశంసించారు. మావోల లొంగుబాటు ఛత్తీస్‌గఢ్‌కే కాదు, మొత్తం దేశానికే చారిత్రాత్మకమైన రోజని అభివర్ణించారు. రాజ్యాంగంపై నమ్మకం చూపిస్తూ పెద్ద సంఖ్యలో నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి చేరనున్నట్లు తెలిపారు. ఆయుధాలు వదిలి లొంగిపోయేవారిని తాము స్వాగతిస్తున్నామని, అలాగే వారికి నైపుణ్యం, పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# బంద్‌కు మద్దతిస్తూనే రాజకీయ డ్రామాలు

- 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు
- బీసీ బిల్లు అడ్డుకునే వారెవరో అందరికీ తెలుసు: పీసీసీ చీఫ్
- బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందన్న మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా:** బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. అయితే కొందరు ఈ బీసీ బిల్లును అడ్డుకుంటున్నారని, ఆ అడ్డుకునే వారెవరో అందరికీ తెలుసునని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఒకవైపు రిజర్వేషన్లు అడ్డుకుంటేనే మరొకవైపు బంద్‌కు మద్దతు ప్రకటించి రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని పీసీసీ చీఫ్ తెలిపారు. నేటి బంద్‌లో తాను కూడా పాల్గొంటానని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఈ బంద్ లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలందరూ పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. బీసీ రిజర్వేషన్లను తెచ్చిందే తామని ఆయన గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని, అయితే న్యాయపరంగా ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. బీసీ బంద్ లో కాంగ్రెస్ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించు కోలేరని విమర్శించారు. రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు మళ్లీ వినిపిస్తామని, నేటి బంద్ ప్రజలను మేల్కొలపడానికి అన్నారు.


# అట్టహాసంగా నవీన్ యాదవ్ నామినేషన్

హాజరైన మంత్రులు , పొన్నం, వివేక్, ఎంపీ అనిల్, మేయర్ గద్వాల

నవీన్ యాదవ్ కు ఎంపీ అసద్ మద్దతు



**హైరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రిటర్నింగ్ అధికారి సాయిరాంకు అందజేశారు. అట్టహాసంగా నామినేషన్ ర్యాలీ జరిగింది. నవీన్ యాదవ్ వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, అజారుద్దీన్, నవీన్ యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్, ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. పదేండ్ల పాటు జూబ్లీహిల్స్ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. షేక్ పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంపీ అసదుద్దీన్ నవీన్ యాదవ్ ను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నువ్వు గెలవాలని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని పోవాలంటూ సూచించారు. నామినేషన్ సందర్భంగా నవీన్ యాదవ్ భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ ఓట్ చోరీ అంశాన్ని ముందరేసుకుందన్నారు. కంటోన్మెంట్ లో శ్రీ గణేశ్ ను గెలిపించినట్టుగానే జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ ను గెలిపించాలని కోరారు. తెలంగాణలో ప్రజా పాలన కొనసాగుతోందని, జూబ్లీహిల్స్ ను రోల్ మోడల్ గా తీర్చి దిద్దుతామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. తనకుకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధితో జూబ్లీహిల్స్ లో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించబోతున్నారని అన్నారు. నవీన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమంలో కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలెప్పుడు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

రెండు వారాల్లో తేదీలు చెబుతామన్న ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీం కోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ ను న్యాయవాది సురేందర్ వేశారు. దీనిపై శుక్రవారం విచారణలో బా గంగా న్యాయస్థానం వాదనలు విన్నది.ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్ని కల కమిషన్ ను హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరాయి. ఇందుకు అంగీకరించి రెండు వా రాల సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రా ష్ట్ర ప్రభుత్వ పిటిషన్ ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరం గా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం విధితమే.

# విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్

## 2026 జూన్ నుంచి అమలుకు సర్కార్ శ్రీకారం

- ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి
- నర్సరీ 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి
- విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

**హైదరాబాద్, మహా:** ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులు, మంచి వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు మెరుగైన విద్య అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు.

**సంస్కరణలన్నీ 2026 జూన్ నెలలో**

విద్యా శాఖ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి, సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు విద్యను అందించే నూతన పాఠశాలలను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని సీఎం అన్నారు. ఈ పైలట్ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులను కల్పించి విద్యను అందించే ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్ (అల్పాహారం), లంచ్ (మధ్యాహ్న భోజనం) అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ మార్పులు, సంస్కరణలన్నీ 2026 జూన్ నెలలో ప్రారంభమయ్యే అకడమిక్ ఇయర్ (విద్యా సంవత్సరం) నుంచి అమలు జరిగేలా సమగ్రమైన యాక్షన్ ప్లాన్‌తో ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# దండుకున్న దండుపాళ్యమే బీఆర్ఎస్

- క్యాబినెట్‌లో రాద్ధాంతం జరిగిందని ఆయన నిరూపించగలరా?
- మాజీ మంత్రి హరీశ్ రావుకు మంత్రి సీతక్క సవాల్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క కౌంటరిచ్చారు. క్యాబినెట్ లో రాద్ధాంతం జరిగిందని ఆయన నిరూపించగలరా? అంటూ సవాల్ విసిరారు. మంత్రులు గ్రూపులుగా విడిపోయారని, దండుపాళ్యం ముఠాకంటే అధ్వాన్నంగా మారిందన్న హరీశ్ .. మంత్రుల పంచాయితీ చెప్పుకోవడానికే క్యాబినెట్ మీటింగ్ అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'క్యాబినెట్లో ఎలాంటి రాద్ధాంతం జరగలేదు. క్యాబినెట్ ఎజెండా, ప్రజల సమస్యలు తప్పా ఇంకేమీ చర్చ జరగలేదు. జరగని విషయాలను జరిగిందని మాట్లాడి ఆయన దిగజారిపోయారు. హరీశ్ రావు నీచమైన స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారు. నిన్న వ్యక్తిగతంగా సీఎంతో మాట్లాడినపుడు కూడా ఇతర మంత్రుల మీద చర్చ చేయలేదు. రాష్ట్రంలో గన్ కల్చర్ తెచ్చింది బీఆర్ఎస్ పార్టీ. అబద్ధానికి నిలువెత్తు సాక్ష్యం హరీశ్ రావు. దండుపాళ్యం, దండుకున్న పాళ్యం బీఆర్ఎస్ పార్టీనే' అని విమర్శించారు.

# ఒకేసారి భారత్, అఫ్గాన్‌తో యుద్ధానికి సిద్ధం

మా వద్ద వ్యూహాలు ఉన్నాయి.. వాటి గురించి చర్చించాం

దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ మరోసారి బీరాలు

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనలు చేసింది. అఫ్గానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. ఖ్వాజా ఆసిఫ్ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా... ''అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను'' అని చెప్పారు. అప్పుడే భారత్ గురించి నోరుపారేసుకున్నారు. అలాగే



తమ దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. ''వారివల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలి'' అని వ్యాఖ్యలు చేశారు.

# చేతికి పతంగి

- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు ఎంఐఎం మద్దతు
- బీఆర్ఎస్ ఓటు బీజేపీకి పోయింది: అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్య

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల హోరు జోరుగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం పార్టీ తమ మద్దతు ప్రకటించింది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నవీన్ యాదవ్‌తోపాటు ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన నామినేషన్ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ ఆయనను కలిశారు. అసదుద్దీన్ ఒవైసీ ఉప ఎన్నికల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక 3.9 లక్షల మంది ఓటర్ల సెంటిమెంట్, కేవలం ఒక్క అభ్యర్థి సెంటిమెంట్ కాదని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాలలో పూర్తిగా విఫలమైంది. వారు 10 సంవత్సరాలు వృధా చేశారు. గత ప్రభుత్వ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కానీ జూబ్లీహిల్స్‌లో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఎంఐఎ జూబ్లీహిల్స్‌లో పోటీ చేయదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 37 శాతం ఓట్ల వాటా వచ్చిందని, 5 నెలల్లో పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వాటా 15 శాతానికి పడిపోయిందని ఓటర్లు అర్థం చేసుకోవాలని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ఓటు బీజేపీకి పోయింది. తెలంగాణలో బీజేపీ వృద్ధిని ఆపాలని ఎంఐఎం పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

# భారత్ ఇప్పుడు అన్‌స్టాపబుల్

## ఉగ్రదాడుల తర్వాత ఎదురుదాడులే.. ప్రధాని మోదీ హెచ్చరిక

**ఢిల్లీ, మహా :** భారత్ ఇప్పుడు అన్‌స్టాపబుల్ అని, ఉగ్రదాడుల తర్వాత ఏమాత్రం మౌనంగా ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడుల ద్వారా ఎదురుదాడి చేస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం ప్రముఖ వార్తా సంస్థ సమ్మిట్‌లో ప్రసంగించిన ఆయన, అనేక అడ్డంకులు, స్పీడ్ బ్రేకర్లు ఉన్నప్పటికీ, భారత్‌ను ఎవరూ ఆపలేరని తేల్చిచెప్పారు. "భారత్ ఇకపై ఉగ్రవాద దాడుల తర్వాత మౌనంగా ఉండదు. వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా వారికి తగిన సమాధానం ఇస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలే ప్రధాన అంశాలుగా ఉన్నప్పుడు, భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ముందుకు సాగింది. తద్వారా మనపై విమర్శలు చేస్తున్నవారిదే తప్పు అని నిరూపించింది. ప్రస్తుతం భారత్ ఎక్కడా, దేనినీ ఆపే మానసిక స్థితిలో లేదు. ఎన్నో రోడ్ బ్లాక్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఉన్నప్పటికీ, భారత్ అన్‌స్టాపబుల్‌గా ముందుకు వెళ్తుంది. మేము ఆగము లేదా నెమ్మదిగా వెళ్లము. 140 కోట్ల మంది భారతీయులు పూర్తి వేగంతో కలిసి ముందుకు సాగుతారు." అని ప్రధాని మోదీ అన్నారు. ఐదు పేద దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్ నేడు ప్రపంచంలోనే ఐదు అగ్రస్థాయి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. చిప్స్ నుంచి షిప్స్ వరకు భారత్ స్వావలంబన సాధించింది. ప్రతి రంగంలోనూ తనదైన విశ్వసంతో ముందుకు సాగుతోంది' అని మోదీ అన్నారు.

# దీపావళి కానుకగా 51 కార్లు

## ఉద్యోగులను సంబరాల్లో ముంచెత్తిన యజమాని.. ఆనందంతో ఉద్యోగుల ర్యాలీ

**మహా, నేషనల్ డెస్క్:** ఆ యాజమాని చేసిన పనికి దేశంలోని ఉద్యోగులంతా నువ్వు సూపర్ బాసూ.. అంటూ అభినందిస్తున్నారు. హర్యానాలోని పంచకులా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ప్రముఖ ఔషధ తయారీ సంస్థ మిట్స్ నేచురా లిమిటెడ్ యజమాని ఎంకే భాటియా ఈసారి దీపావళి సందర్భంగా తన ఉద్యోగులకు విశేష కానుకలు అందించారు. ఒక్కరు ఇద్దరికి కాదు ఏకంగా 51 మందికి కొత్త కార్లను అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్ల కీ లు అందుకున్న సిబ్బంది ఆనందంతో ఉప్పొంగిపోయారు. దీపావళి పండుగ వచ్చిందంటే చాలామంది బహుమతులు, బోనస్లు ఇచ్చే సంప్రదాయం ఉంటుంది. కానీ మిట్స్ నేచురా యజమాని భాటియా మాత్రం ఈ సంప్రదాయాన్ని ఒక కొత్త స్థాయికి తీసుకెళ్లారు. ప్రతి ఏడాది తన కంపెనీ సిబ్బందికి కొత్త కార్లను బహుమతిగా అందిస్తూ, వారిలో ఉత్తేజాన్ని పెంపొందిస్తున్నారు. ఈసారి కూడా ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ, ఉద్యోగులకు 51 కార్లు గిఫ్ట్‌గా ఇచ్చారు. భాటియా స్వయంగా కార్ల తాళాలు అందజేసి, ప్రతి ఒక్కరినీ అభినందించారు.

**ప్రతి ఏడాది కొత్త సర్‌ప్రైజ్**




మిట్స్ నేచురా యజమాని భాటియా దీపావళి సందర్భంగా ఉద్యోగులకు బహుమతులు ఇవ్వడం ఇదేం తొలిసారి కాదు. గత 2023, 2024ల్లోనూ ఆయనే స్వయంగా కొత్త కార్లను గిఫ్ట్ ఇచ్చి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ హాఫ్ సెంచరీ కొట్టారు. మొత్తం 51 కార్లను ఒకేసారి పంపిణీ చేశారు. కొత్త కారు తాళాలు చేతిలోకి రాగానే ఉద్యోగులు ఆనందంతో తేలిపోయారు. చాలా మంది భాటియాకు సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కూడా వైరల్ అయ్యాయి. కంపెనీ ఆవరణలోని వేడుకలు, కార్ల ఊరేగింపులు, ఉద్యోగుల ఆనందభావాలు చూసిన వారందరికీ ఇదే నిజమైన దీపావళి అనిపించిందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# మీరు దేవుడు సామీ

## అక్షరాలా 5000.. మరో బిడ్డకు ప్రాణం పోసిన మహేష్ బాబు

**హైదరాబాద్, మహా :** సూపర్ స్టార్ మహేష్ బాబుకు కోట్లాది మంది అభిమానులుండడానికి కారణం కేవలం సినిమాలే కాదు. ఆయన చేస్తోన్న సామాజిక సేవా కార్యక్రమాలు కూడా. మహేష్ బాబు ఫౌండేషన్ పేరుతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నాడీ సూపర్ స్టార్. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది చిన్న పిల్లలకు ఉచితంగా చేస్తోన్న గుండె ఆపరేషన్లు. తన కుమారుడు గౌతమ్ పుట్టినప్పుడు కొన్ని అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. హార్ట్ ప్రాబ్లమ్ ఉండడంతో సర్జరీ చేయించాడు. ఈ ఘటనే ఓ గొప్ప మంచి పనికి పునాది అయ్యింది. తన కుమారుడిలా మరొక పిల్లాడికి అలాంటి సమస్యలు రాకూడదని తలంపుతో గుండె జబ్బులు ఉన్న చిన్నారులకు ఉచితంగా వైద్యం చేయించాలని నిర్ణయించుకున్నాడు. అలా ఇప్పటివరకు వేల మంది చిన్నారులకు ఉచితంగా హార్ట్ సర్జరీలు చేయించాడీ రియల్ హీరో. తద్వారా వారి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపాడు.. శుక్రవారంతో మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొత్తం 5000 ఉచిత హార్ట్ సర్జరీలు పూర్తయ్యాయి. దీనితోసోషల్ మీడియాలో మహేష్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. నువ్వు దేవుడివి సామీ.. నీ సాయం ఇలాగే కొనసాగాలి అంటూ నెటిజన్లు కామెంట్స్ తో అభినందిస్తున్నారు.



# బంగారం లక్షన్నర రేట్లు.. పైపైకి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ లో శుక్రవారం ఒక్కరోజే 24 క్యారెట్స్ 10 గ్రాముల (తులం) బంగారం రూ. 3300 లు పెరిగి 1,32,770 రూపాయలకు చేరింది. అదే విధంగా 22 క్యారెట్స్ బంగారం (తులం) 10 గ్రాముల ధర 3,050 రూపాయలు పెరిగి 1,21,700 రూపాయలకు చేరింది. ఈ ధరలు హైదరాబాద్ నగరం తో పాటు తెలుగు రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో కూడా కొనసాగుతున్నాయి.


**రాబోయే రోజుల్లో తగ్గుతుందా..?**

బంగారం ధరలు ప్రస్తుతం ఆకాశాన్ని అంటుతుండగా రాబోయే రోజుల్లో తగ్గుముఖం పడతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా ఆంక్షల వల్ల బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయని, ఆ తర్వాత ధరలు తగ్గుతాయని భావిస్తున్నారు. కానీ ఏదేమైనా ప్రస్తుతం మాత్రం బంగారం కొనలేని పరిస్థితిలు నెలకొన్నాయి.

# ఇండియాలో నెంబర్ వన్ హైదరాబాదే

## గ్లోబల్ కంపెనీలకు హైదరాబాదే కేరాఫ్

### 10 రోజులకు ఒక కొత్త జీసీసీ ఏర్పాటు
### హైదరాబాద్ కు అమెరికా కంపెనీల క్యూ
### మౌలిక సదుపాయాలకు తోడు ప్రభుత్వ మద్దతు



**హైదరాబాద్ మహా:** గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించడంలో హైదరాబాద్ ఇండియాలోనే నెంబర్ వన్ గా ఉంది. హైదరాబాద్ లోని జీసీసీలలో 3లక్షల మందికి పైగా ఐటీ నిపుణులు పనిచేస్తున్నారు. సగటున ఒక్క జీసీసీకి వేయిమందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయి. హైదరాబాద్ లో పదిరోజులకో కొత్త జీసీసీ ఏర్పాటవుతుండగా, ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3,200 జీసీసీలు ఉంటే.. అందులో 1700కేంద్రాలు భారత్‌లోనే ఏర్పాటయ్యాయి. జీసీసీలలో హైదరాబాద్ వాటా 40 శాతం కాగా, తర్వాత స్థానంలో బెంగుళూరు 33శాతం తో ఉంది. అమెరికా కంపెనీలు ప్రధానంగా హైదరాబాద్ కు క్యూ కడుతున్నాయి. ఇతర మెట్రో సిటీలతో పోలిస్తే వ్యయాలు తక్కువ కావడం, సాంకేతికత సహా సాంకేతికేతర పారిశ్రామిక రంగాలు విస్తరించి ఉండటం, నిపుణులు అందుబాటులో ఉండడం, వాతావరణం హైదరాబాద్‌కు ప్రధాన సానుకూలతలుగా మారినట్లు ఎక్స్‌ఫీనో నివేదిక పేర్కొంది. భాగ్యనగరంలోని హైటెక్‌సిటీ, ఫినాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, మదాపూర్ ప్రాంతాల్లో జీసీసీలు ఎక్కువగా ఉన్నాయి. భవిష్యత్తులో జీసీసీ కేంద్రాలకు హైదరాబాద్ హబ్ గా మారి తెలంగాణ రాష్ట్రం వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకునేందుకు దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

**అమెరికా కంపెనీల ఆసక్తి హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో ప్రతి 10 రోజులకు ఒక కొత్త జీసీసీ ఏర్పాటు అవుతోందని ఎక్స్‌ఫీనో వెల్లడించింది. అమెరికా కంపెనీలు అధికంగా హైదరాబాద్‌లో తమ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. వేగంగా ఎదగడానికి ఉన్న అవకాశాలు, నాయకత్వ అనుభవం, నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను బహుళ జాతి కంపెనీలు పరిశీలించి హైదరాబాద్‌లో జీసీసీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయని వివరించింది. మౌలిక సదుపాయాలకు తోడు ప్రభుత్వ మద్దతు కూడా ఇందుకు ఉపకరిస్తోందని విశ్లేషించింది.

**హైదరాబాద్ ఫస్ట్.. తర్వాత బెంగుళూరు**

ఈ నివేదిక ప్రకారం గత మూడేళ్లలో దేశంలో ఏర్పాటైన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 40% హైదరాబాద్‌కు, బెంగళూరుకు 33% వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని 360 జీసీసీల్లో 3.1 లక్షల మంది నిపుణులు పనిచేస్తున్నారు. ఇది తెలంగాణలోని నైపుణ్య ఉద్యోగాల్లో 14% వాటా కలిగి ఉంది. జీసీసీ ఉద్యోగుల్లో 33% మంది మహిళలే ఉండగా అందులోనూ నాయకత్వ స్థానాల్లో 19%మంది ఉన్నారు. రాష్ట్రంలో 47.8 లక్షల మంది సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఇతర మెట్రో సిటీలతో పోలిస్తే హైదరాబాద్ కు అనేక అనుకూతలు ఉన్నాయని ప్రధానంగా ఖర్చు తక్కువ, నిపుణుల లభ్యత, వాతావరణ పారిశ్రామిక పరిస్థితులు కారణాలుగా ఎక్స్‌ఫీనో నివేదిక పేర్కొంది.

**జీసీసీ అంటే..**

అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల ఉప కార్యాలయాలనే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అంటారు. అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు చెందిన కంపెనీలు తమ ప్రధాన కార్యాలయాలకు పొరుగు, ప్రాసెస్ సేవలను అందించేందుకు నైపుణ్యంతోపాటు, చవకగా మానవ వనరులు లభించే ఇతర దేశాల్లో జీసీసీలను ఏర్పాటు చేస్తున్నాయి. వీటిని ఐటీ, ఆర్ అండ్ డీ, ఫైనాన్స్, టెలికాం, బ్యాంకింగ్, వినియోగదారుల మద్దతు వంటి బహుళ సేవలను అందించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాయి. ఇందుకు భారీస్థాయిలో ఏఐ, జెన్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్, ఐవోటీ, క్లౌడ్, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ వినియోగాన్ని పెంచుతున్నాయి. ఎక్స్ ఫినో సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3,200 జీసీసీలు ఉన్నాయి. వీటిలో 53% అంటే 1700కేంద్రాలు భారత్‌లోనే ఏర్పాటయ్యాయి. 2028 నాటికి దేశంలో జీసీసీల సంఖ్య 2100కు పెరుగుతుందని రిపోర్టు అంచనా వేసింది. బెంగళూరు, భాగ్యనగరం తర్వాత చెన్నై, ఢిల్లీ, ముంబయి, పుణె వంటి నగరాల్లో జీసీసీలు అధికంగా ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి.

**ఐటీ, ఫార్మా దిగ్గజ కంపెనీలన్నీ**

హైదరాబాద్‌లో వందలాది జీసీసీ సెంటర్లు ఉన్నాయి. వాటిలో జీవ శాస్త్రాలు, ఫార్మా రంగానికి చెందిన బహుళ జాతి కంపెనీల కేంద్రాలు ఉన్నాయి. ప్రముఖ 10 ఫార్మా కంపెనీల్లో 8 సంస్థల జీసీసీలు భాగ్యనగరంలోనే ఉండటం విశేషం. ఇవే కాకుండా హెల్త్‌కేర్ సేవల సంస్థ అయిన ఎవర్‌నార్త్, ప్రపంచంలోని అతిపెద్ద యానిమల్ హెల్త్ కంపెనీ అయిన జోటిస్ పరిశోధనా కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఐటీ, సాఫ్ట్‌వేర్ విషయానికి వస్తే గూగుల్, మైక్రోసాఫ్ట్, డెల్ టెక్నాలజీస్, అమెజాన్, ఇన్ఫోసిస్, విప్రో వంటి అనేక సంస్థలు ఉన్నాయి. బ్యాంకింగ్ కంపెనీలతో పాటు అంతర్జాతీయ బీమా సంస్థల కేంద్రాలు భాగ్యనగరంలో ఉన్నాయి. వీటితో పాటు హెల్త్ కేర్ అండ్ లైఫ్ సైన్స్, ఆటోమేటివ్ అండ్ ఏరోస్పేస్, ఈకామర్స్ తదితర రంగాలకు చెందిన జీసీసీ కేంద్రాలు హైదరాబాద్‌లో కొలువు దీరాయి.

# దేశంలోనే రిచెస్ట్ జిల్లాగా రంగారెడ్డి ఇండియా నెంబర్ వన్

**హైదరాబాద్, మహా:** భారతదేశంలోనే రిచెస్ట్ జిల్లాగా రంగారెడ్డి దూసుకుపోతోంది. కేంద్రప్రభుత్వ ఆర్థికసర్వేతో పాటు తాజాగా ఆర్థికస్థితిగతులపై పలు సంస్థలు నిర్వహించిన సర్వేలలో ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. దేశంలోని సంపన్న జిల్లాల జాబితాలో ఒకప్పుడు గురుగ్రామ్ ఉండి, దానిని వెనక్కు నెట్టేసి ఈ ఏడాది 2025లో నెంబర్ వన్ స్థానంలో రంగారెడ్డి దూసుకుపోతోంది . తాజా డేటా ప్రకారం రంగారెడ్డి జిల్లా నుంచి తలసరి జీడీపీ రూ.11లక్షల 46వేలుగా ఉన్నట్లు వెల్లడైంది. ప్రధానంగా ప్రపంచ ఐటీ సంస్థలకు దిక్సూచిగా, ప్రత్యామ్నాయంగా.. హబ్ గా ఉన్న హైదరాబాద్ ఐటీ తో పాటు ఫార్మా, టెక్ వివిధ రంగాల్లో సరిలేరు నీకెవ్వరు అన్నచందంగా దూసుకుపోతోంది. రోజురోజుకూ కొత్త కంపెనీల రాకతో దేశం నలుమూలల నుంచి రంగారెడ్డి జిల్లాకు నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, కార్మికులు, యువత వలస వస్తున్నారు. తొలిస్థానంలో రంగారెడ్డి విజయ పరంపరతో ముందుకు సాగుతుండగా.. గురుగ్రామ్, బెంగళూరు, నోయిడా వంటి నగరాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దీంతో రంగారెడ్డి, హైదరాబాద్ ఘనతలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఏపీ ప్రభుత్వం కేవలం డేటా సెంటర్ కే హైప్ చేసుకుంటుండడంతో ఇది సార్.. మా బ్రాండ్ అంటూ తెలంగాణ యువత పోస్టుల మీద పోస్టులు పెడుతున్నారు.

# పత్తి ఉత్పత్తిలో మనమే టాప్

## దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్
## కేంద్రం ప్రశంసలు.. వాణిజ్యరాష్ట్రాలను దాటి ముందుకు



**హైదరాబాద్, మహా :** పత్తి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. గుజరాత్, మహారాష్ట్ర లాంటి వాణిజ్య రాష్ట్రాలను తలదన్ని పత్తి ఉత్పత్తిలోనూ తెలంగాణ నెంబర్ వన్ స్థానానికి ఎగబాకింది. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని, 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారనా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం ప్రకటించారు. దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ పత్తి రాష్ట్రంగా మారిందన్నారు. గత ఏడాది కూడా తెలంగాణ సాటిలేని మేటిగా నిలిచింది. పత్తి కొనుగోళ్లలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. 202425 పత్తి కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా పత్తి కొనుగోళ్లను నమోదు చేసి టాప్‌లో నిలిచిన విషయాన్ని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ ఈ ఏడాది ఏప్రిల్ లో అధికారికంగా ప్రకటించింది. మార్చి 31, 2025 వరకూ జరిగిన కొనుగోళ్లలో తెలంగాణ నుంచి మొత్తం 40 లక్షల పత్తి బేళ్లు సేకరించినట్లు కేంద్రం వెల్లడించింది. తెలంగాణ ఉత్పత్తితో పోల్చితే.. తరువాతి స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలు కనీసం దరిదాపుల్లో లేవని కేంద్రం చెప్పింది. తెలంగాణ తర్వాతి స్థానంలో 30 లక్షల బేళ్లతో మహారాష్ట్ర రెండో స్థానంలో నిలిచింది. గుజరాత్ 14 లక్షల బేళ్లు, కర్ణాటక 5 లక్షల బేళ్లు, మధ్యప్రదేశ్ 4 లక్షల బేళ్లు, ఆంధ్రప్రదేశ్ 4 లక్షల బేళ్లు, ఒడిశా 2 లక్షల బేళ్లు, హర్యానా, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలు 1.15 లక్షల బేళ్లు మాత్రమే ఉత్పత్తి చేసినట్టు కేంద్రం వెల్లడించిన లెక్కలు చెప్తున్నాయి. ఇలా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు అనుకూల విధానాలతో.. వ్యవసాయంలో తగ్గేదెలే అంటూ రైతులు దూసుకువెళ్తున్నారు.

**పూర్తిస్థాయి కొనుగోలు చేస్తాం - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని కేంద్రమంత్రి తెలిపారు. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ప్లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ప్లాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ప్లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ప్లాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

## మత్తు పదార్థాల వ్యసనాన్ని పూర్తిగా అరికట్టాలి
## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. తెలంగాణలో మత్తు పదార్థాల వ్యసనాన్ని పూర్తిగా అరికట్టాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం ఉంటేనే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనపై పోరులో పోలీసు, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ మేరకు ఇరు డిపార్ట్‌మెంట్ల ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడం కేవలం ప్రభుత్వంతో సాధ్యం కాదని, సమాజంలోని అన్ని వర్గాలనూ ఈ పోరాటంలో భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, టీచర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటున్న వారిలో వచ్చే బిహేవియరల్ ఛేంజెస్ గురించిన అవగాహన ప్రతి పేరెంట్‌కు, టీచర్‌కు ఉండాలన్నారు. ఈ విషయంలో విస్తృత ప్రచారం జరగాలని మంత్రి సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లలో రెగ్యులర్‌గా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తల ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. సమావేశంలో టీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, టీఏఎన్‌బీ ఎస్పీ రూపేశ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్, డాక్టర్ అనిత, న్యాయ శాఖ అడిషనల్ సెక్రటరీ సునీత తదితరులు పాల్గొన్నారు.

# పీఎం జన్‌మన్‌లో తెలంగాణకు మూడో ర్యాంకు

## అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




**న్యూఢిల్లీ, మహా:** ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. అక్టోబర్ 17న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు PMJANMAN, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరథి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు.

**బెస్ట్ పెర్ఫార్మర్స్ స్క్రీన్ డిస్ప్లే..**

1. ఆదికర్మయోగి అభియాన్ ఆదిలాబాద్, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం
2. ఉత్తమ ప్రదర్శన సూపర్ కోచ్/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్ డాక్టర్ కీర్తి
3. ధార్తీ అభా జనభాగిదారి అభియాన్ ఆదిలాబాద్, ఆసిఫాబాద్

ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేశ్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు రూ. 156 కోట్లు విడుదల

## సరఫరా చేసిన వస్తువుల బిల్లుల కోసం ఫండ్స్ రిలీజ్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు పోషకాహార పథకం (ఎస్ఎన్పీ) కింద సరఫరా చేసిన వస్తువుల బిల్లుల కోసం అవసరమైన నిధులను ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా వస్తువులు, కూరగాయలు, గ్యాస్ సరఫరాలు, ఇంటి అద్దెల వంటి ఖర్చుల కోసం మొత్తం రూ.156 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, ఖర్చులకు సంబంధించిన అన్ని బిల్లులను వెంటనే సమర్పించాల్సిందిగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ అన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లోపు అన్ని జిల్లాలు తమ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని ఈ ఆదేశాల్లో పేర్కొంది.



# గుజరాత్‌లో కొలువుదీరిన కొత్త క్యాబినెట్

- 25 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం
- మంత్రివర్గంలో చాన్స్ కొట్టేసిన క్రికెటర్ జడేజా భార్య రివాబా జడేజా

గుజరాత్, మహా: గుజరాత్‌లో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగతా మంత్రులంతా రాజీనామా చేయడంతో శుక్రవారం నూతన క్యాబినెట్ ఏర్పాటు అయింది. ఈ సందర్భంగా 25 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా కూడా ఉన్నారు. ఈ పునర్వ్యవస్థీకరణలో గుజరాత్ హోంమంత్రి నేత హర్ష్ రమేష్‌భాయ్ సంఘవీ డిప్యూటీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిని లక్షకు పైగా ఓట్లతో ఓడించి ఘన విజయం సాధించారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సమక్షంలో ఆయన ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రిగా భూపేంద్ర పటేల్ కొనసాగుతున్నారు. కమలం అధిష్టానం క్యాబినెట్‌లో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చింది. 7 మంది పాటిదార్లు, 8 మంది ఓబీసీలు, 3 మంది ఎస్సీలు, 4 మంది ఎస్టీలు, 3 మంది మహిళా నేతలు ఉన్నారు. కొత్త క్యాబినెట్‌లో ఎక్కువ మంది కొత్తవారికే అవకాశం లభించింది. గత క్యాబినెట్‌లో ఉన్న మంత్రుల్లో కేవలం ఆరుగురు మాత్రమే తిరిగి పదవులు చేపట్టారు.

# సింగరేణి కార్మికులకు తీపి కబురు


## రూ.400 కోట్ల దీపావళి బోనస్ విడుదల
## సింగరేణి కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన భట్టి



**ఖమ్మం, మహా:** దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటన పట్ల.. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం ప్రతిసారి ప్రకటించినట్లే ఈ ఏడాది కూడా.. సింగరేణి కార్మికులకు 400 కోట్ల రూపాయల బోనస్ ప్రకటించిందన్నారు. సింగరేణి కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన భట్టి విక్రమార్క.. ఖమ్మం జిల్లా నుంచే సింగరేణి ప్రస్థానం మొదలైందన్నారు. సింగరేణి ఇప్పుడు రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఎదిగిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్టుకు, ఇతర ఇండస్ట్రీలకు పనికివచ్చే బొగ్గును.. సింగరేణి సరఫరా చేస్తోందని భట్టి విక్రమార్క కొనియాడారు. అనంతరం బిజేపీపై మండిపడ్డారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ తీరు బాగోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కాకుండా అడ్డుపడుతుంది బీజేపీనే అని భట్టి ఆరోపించారు.

**బీజేపీ డ్రామాలను గమనిస్తూన్నే ఉన్నాం..**

బీసీ బిల్లు విషయంలో బీజేపీ వ్యవహరిస్తున్న విధానం దేశం మొత్తం చూస్తోందన్నారు. బీసీ బిల్లు విషయంలో హైకోర్ట్, సుప్రీంకోర్టుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ కొట్లాడుతోందని భట్టి తెలిపారు. బీసీ బిల్లు ఆమోదం కోసం తమ వైపు నుంచి చేసే ప్రయత్నాలు చేస్తున్నామని భట్టి చెప్పారు. నేడు జరిగే బంద్ బీసీ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతున్నందుకేనన్నారు. బీసీ బిల్లు విషయంలో బీజేపీ అడ్డుపడడమే కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతోందని భట్టి అన్నారు. బీసీలు అంత అమాయకులు కాదని.. బీజేపీ డ్రామాలను గమనిస్తూన్నే ఉన్నారన్నారు. రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వచ్చి రాష్ట్రపతిని ,ప్రధానమంత్రిని కలుస్తామని పదేపదే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసిన కేంద్రం నుంచి అనుమతి ఇవ్వలేదని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న బీసీ బంద్ నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొని.. విజయవంతం చేయాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.



## బొబ్బిలిలో 70 అనధికార లేఅవుట్లకు

# ఐపీఎల్పి ఆమోదం

## మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి


**విజయనగరం జిల్లా.మహా:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ( ఎల్ఆర్ఎస్ ) కింద అనధికార లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో బొబ్బిలి పురపాలక సంఘ పరిధిలో 70 అనధికార లేఅవుట్లు గుర్తించ బడ్డాయని మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి ప్రకటనలో పేర్కొన్నారు వాటిని ఇన్ ప్రిన్సిపల్ లేఅవుట్ ప్యాటర్న్ ( ఐ పి ఎల్ పి ) గా ఆమోదించారు.అయితే ఆమోదించబడిన లేఅవుట్లకు చెందిన పలువురు ప్లాట్ యజమానులు ఇప్పటివరకు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తులు సమర్పించలేదని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆమోదం పొందిన ఐపీఎల్ వివరాలు ప్రతి సచివాలయం పరిధిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.రెగ్యులరైజేషన్ చేయని వారు భవన అనుమతుల సమయంలో 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు మరియు 33 శాతం పెనలైజేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 33 శాతం పెనలైజేషన్ చార్జీలు మాఫీ చేయబడగా, ఓపెన్ స్పేస్ చార్జీలపై 50 శాతం రాయితీతో కేవలం 7 శాతం మాత్రమే చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించబడిందని పురపాలక సంఘం అధికారులు తెలిపారు. కావున బొబ్బిలి పురపాలక పరిధిలో గల భవన యజమానులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు.

# ఏం సాధించారని విజయోత్సవాలు?

- 23 నెలల పాలనలో ప్రభుత్వం చేసింది శూన్యం
- రాష్ట్ర మంత్రివర్గం దండుపాళ్యం ముఠా మాదిరి తయారైంది
- మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. ఈ 23 నెలల పాలనలో ఏం సాధించారు అని విజయోత్సవాలు జరుపుతారు అని నిలదీశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమాలు నడుపుతారంటా..ఎందుకు నాయన తుపాకులు పెట్టి వసూళ్లు బాగా చేసినందుకా? కమిషన్ల కోసం క్యాబినెట్‌లో గల్లాలు పట్టుకొని కొట్టుకున్నందుకా? మంత్రుల మధ్య తగాదాలు జరుగుతున్నందుకా? ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను రేవంత్ సర్కార్ తుంగలో తొక్కింది. అవ్వాతాతలకు పెన్షన్ ఇవ్వకుండా మోసం చేసినందుకు విజయోత్సవాలు జరుపుతారా..? నెలకు రూ. 2500 ఇస్తారేమోనని మహిళలు ఎదురు చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయని వర్గం లేదు. రైతుబంధు ఇవ్వనందుకు, రుణమాఫీ చేయనందుకు ఉత్సవాలు జరుపుతారా..? గురుకులాల్లో పిల్లలు పిట్టల్లా రాలుతున్నందుకు ఉత్సవాలు జరుపుతారా..? నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వనందుకు ఉత్సవాలు జరుపుతారా..? అని హరీశ్‌రావు నిలదీశారు. పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, సినిమా పెద్దలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ప్రభుత్వం మిమ్మల్ని ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకురండి.. మేము కాపాడుతాం. మీకోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి కాకీ బుక్‌లో మంత్రులకు రూల్స్ వేరేలా ఉన్నాయా? టెండర్లు వేయొద్దని మంత్రులు బెదిరిస్తుంటే.. ముఖ్యమంత్రి సన్నిహితులు తుపాకులు పట్టుకొని తిరుగుతుంటే వారి మీద కేసు లేదు. ఒక ట్వీట్‌ను రీట్వీట్ చేస్తే కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారు అని హరీష్ రావు తెలిపారు.




మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, తిరుపతి | 18-10-2025




ANN తెలుగు



# డ్యూడ్ రివ్యూ..



# సుధీర్ బాబు జటాధర ట్రైలర్ రిలీజ్

టాలీవుడ్ నటుడు సుధీర్ బాబు (Sudheer Babu) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర' (Jatadhara). ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్ & అభిషేక్ జైస్వాల్ (Venkat Kalyan & Abhishek Jaiswal) సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. వెంకట్ కళ్యాణ్ కథనందిస్తున్నాడు. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాతో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి తాజాగా మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు. ఈ సినిమాను నవంబర్ 07న విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే మైథాలాజికల్, సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో సోనాక్షి శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. రైన్ అంజలి, శిల్పా శిరోడ్కర్ కీలక పాత్రల్లో నటిస్తుండగా.. జీ స్టూడియో సమర్పణలో ఉమేశ్ కె.ఆర్.భన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# మీరు ప్రేమలో ఉన్నారా?

**లవ్ టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ చిత్రాలతో తెలుగులో కూడా మంచి విజయాలు అందుకున్నాడు ప్రదీప్ రంగనాథన్.. తాజాగా ఆయన నటించిన సినిమా డ్యూడ్ విడుదలైంది.. హ్యాట్రిక్ విజయం కోసం మరోసారి యూత్‌న్ టార్గెట్ చేస్తూనే ఈ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇందులో ప్రేమలు బ్యూటీ మమితా బైజు హీరోయిన్‌గా నటించగా.. శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించారు. డ్యూడ్ సినిమాతో మలయాళ నటుడు హృదు హరూన్ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రాన్ని దర్శకుడు కీర్తిశ్వరన్ తెరకెక్కించారు. గతంలో ఆయన సుధా కొంగర వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు.**

### కథ ఏంటి..?

ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా డైరెక్ట్‌గా కథలోకి వెళ్లిపోతాడు దర్శకుడు. రాష్ట్రంలో ఎంతో పేరు పొందిన మంత్రిగా ఆదికేశవులు (శరత్ కుమార్) ఉంటాడు. తన రాజకీయ భవిష్యత్ కోసం ఏమైనా చేయగలిగే వ్యక్తి. తన కులానికి చెందిన వాడినే అల్లుడిగా చేసుకోవాలని కోరుకుంటాడు. అలాంటి వ్యక్తికి కుమార్తె కుందన (మమితా బైజు) ఉంటుంది. ఆమెకు మేనత్త కుమారుడు గగన్ (ప్రదీప్ రంగనాథన్).. ఇద్దరి మధ్య చిన్నతనం నుంచే మంచి బాండింగ్ ఉంటుంది. ఈ క్రమంలోనే గగన్‌ను కుందన ప్రేమిస్తుంది. కానీ, అతను మాత్రం మరో అమ్మాయిని ఇష్టపడుతాడు. వారిద్దరి మధ్య బ్రేకప్ కాగానే కుందన తన ప్రేమ విషయాన్ని గగన్‌తో పంచుకుంటుంది. అయితే, గగన్ ఆమె ప్రేమను తిరస్కరిస్తాడు. దీంతో కుంగిపోయిన కుందన ఒంటరిగా ఉండేందుకు బెంగళూరు వెళ్లిపోతుంది. ఆమె దూరమే గగన్‌కు తన ప్రేమను అర్థమయ్యేలా చేస్తుంది. అయితే, తన ప్రేమ విషయాన్ని మొదట తన మామ (శరత్ కుమార్)తో చెప్తాడు. సంతోషంగా పెళ్లికి ఒప్పుకొని ఏర్పాట్లు కూడా చేస్తాడు. బెంగళూరు నుంచి తిరిగొచ్చిన కుందన తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని చెబుతుంది. అలా కుందన సడెన్‌గా నిర్ణయం మార్చుకోవడానికి ఉన్న కారణం ఏంటి.. గగన్ కుందన పెళ్లికి ఉన్న చిక్కులు ఎవరి వల్ల వచ్చాయి.. కుందన ఎలాంటి కారణాలు చెబుతుంది... ప్రియురాలి కోసం గగన్ చేసిన త్యాగం ఏంటి.. గగన్ తల్లి (రోహిణి), కుందన తండ్రి (శరత్ కుమార్) అన్నాచెల్లెలు.. అయినప్పటికీ ఎందుకు మాట్లాడుకోరు.. ఫైనల్‌గా కుందనతో గగన్ పెళ్లి జరిగిందా లేదా అనేది తెలియాలంటే డ్యూడ్ చూడాల్సిందే.

### ఎలా ఉందంటే..?

డ్యూడ్ సినిమా ప్రమోషన్‌లో ఈ కథకు స్ఫూర్తి అల్లు అర్జున్ నటించిన ఆర్య2 చిత్రమేనని దర్శకుడు చెప్పారు. ఆయన ఈ మాట ఎందుకు చెప్పారనేది చిత్రం చూసిన తర్వాత తెలుస్తోంది. ఆర్య కాన్సెప్ట్‌నే డ్యూడ్‌లో చూపించారు. లవ్ ఫెయిల్ అయితే దేవదాస్‌లు కానక్కర్లేదు.. ప్రేయసి కోసం ప్రేమికుడిగా ఏం చేయవచ్చో డ్యూడ్ చెప్తాడు. కథలో పెద్దగా కొత్తదనం ఉండదు. కానీ, ఫుల్ ఫన్‌తో ఈ చిత్రం ఉంటుంది. కథ చాలా రొటీన్‌గా ఉన్నప్పటికీ తెరపై దర్శకుడు చూపించిన తీరు ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఈ విషయంలో కీర్తిశ్వరన్ విజయం సాధించాడు. కాన్సెప్ట్ అంతా పాతదే అయినప్పటికీ నేటి యూత్ కోసం కొత్తగా చూపించాడు. నిజమైన ప్రేమకు ఎమోషన్స్ చాలా ఎక్కువగానే ఉంటాయి. ఈ పాయింట్‌నే డ్యూడ్‌లో చూపించారు. డ్యూడ్ మూవీ చూస్తున్నంత సేపు అక్కడక్కడ ఆర్య2 గుర్తుకు వస్తుంది. అయితే, ఇక్కడ ఆ సీన్లు చాలా ఫ్రెష్‌గానే ఉంటాయి. ఈ మూవీలో డైలాగ్స్ చాలా చోట్ల యూత్‌తో విజిల్స్ వేపించేలా ఉంటాయి. అయితే. క్లైమాక్స్‌లో మినహా ఎక్కడా కూడా భావోద్వేగంతో కూడిన సీన్స్ కనిపించవ్.. కానీ, కుందన ప్రేమను గగన్ తిరస్కరించిన సమయంలో వచ్చే సీన్ ప్రతి ప్రేమికుడిని గుచ్చేస్తుంది. సినిమా ఎండింగ్ కూడా ప్రేక్షకుడిని సంతృప్తి పరిచేలా ఉంటుంది.

### ఎవరెలా చేశారంటే..?

డ్యూడ్‌కు ప్రధాన బలం ప్రదీప్ రంగనాథ్.. గత సినిమాల మాదరే ఫుల్ ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. సినిమా ప్రారంభం నుంచి క్లైమాక్స్ వరకు తన ఎక్స్‌ప్రెషన్స్‌తో దుమ్మురేపాడు. ఆ తర్వాత శరత్ కుమార్ అద్భుతంగా నటించారు. ఇందులో ఆయన కాస్త ఫన్నీగా కనిపించడమే కాకుండా అవసరమైన చోట సీరియస్‌గా కనిపించి తన పాత్రకు వంద శాతం న్యాయం చేశారు. అయితే, మమితా బైజు వారిద్దరితో పోటీ పడుతూ నటించింది. నటన పరంగా మంచి స్కోప్ ఉన్న పాత్రనే ఆమెకు దక్కిందని చెప్పవచ్చు.
మలయాళ నటుడు హృదు హరూన్, రోహిణి తమ పరిదిమేరకు నటించారు. తమిళ హీరో సూర్య నటించిన ఆకాశం నీ హద్దురా సినిమాకు అసిస్టెంట్ దర్శకుడిగా పనిచేసి కీర్తిశ్వరన్.. డ్యూడ్ సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యారు. మొదటి సినిమాతోనే మెప్పించాడని చెప్పవచ్చు. డ్యూడ్ చిత్రానికి మరో ప్రధాన బలం సంగీతం. సాయి అభ్యంకర్ అందించిన మ్యూజిక్ ప్రేక్షకుడిలో జోష్ నింపుతుంది. ఫైనల్‌గా ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే సినిమా అని చెప్పవచ్చు. యూత్‌న్ మాత్రం నిరాశపరచదని చెప్పవచ్చు.



# చిరంజీవి సినిమాలో...

చిరంజీవి సరసన మాళవికా మోహనన్ నటించనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. 'వాల్తేరు వీరయ్య' (2023) వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో చిరంజీవి, దర్శకుడు బాబీ (కేఎస్ రవీంద్ర)ల కాంబినేషన్‌లో ఓ సినిమా రానుంది. కెవిన్ ప్రొడక్షన్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. చిరంజీవి కెరీర్‌లోని 158వ సినిమా ఇది. కాగా ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్స్‌కు చాన్స్ ఉందని, ఒక హీరోయిన్‌గా మాళవికా మోహనన్, మరో హీరోయిన్‌గా రాశీ ఖన్నా నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ సినిమా కథనం ఉంటుందని, అతి త్వరలోనే ఈ సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై ఓ స్పష్టత రానుందని సమాచారం. మరి... చిరంజీవి సరసన రాశీ ఖన్నా, మాళవికాలకు హీరోయిన్లుగా నటించే చాన్స్ లభిస్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ది రాజాసాబ్' సినిమాతో తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు మాళవికా మోహనన్. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, రిద్ధి కుమార్ కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది.



# ముచ్చటగా మూడోసారి!

హీరో రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబోలో వచ్చిన తొలి చిత్రం 'జైలర్' 2023 ఆగస్టు 10న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరి కలయికలో 'జైలర్ 2' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'జైలర్' సూపర్ హిట్ కావడంతో 'జైలర్ 2' సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2026 జూన్‌లో 'జైలర్ 2' విడుదల కానుంది. ఇదిలా ఉంటే... రజనీకాంత్ – నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి రిపీట్ కానుందని కోలీవుడ్ టాక్. ఇప్పటికే 'జైలర్ 2' చిత్రీకరణ సుమారు 70 శాతం పూర్తయిందట. ఈ సినిమా తర్వాత మరోసారి రజనీకాంత్‌తో ఓ మూవీ కోసం నెల్సన్ దిలీప్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ స్టోరీ లైన్‌ని ఇటీవల రజనీకాంత్‌కి వినిపించగా ఆయన కూడా పచ్చజెండా ఊపారట. మరి... రజనీ-నెల్సన్ కాంబినేషన్‌లో మూడో చిత్రం ఉంటుందా? అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.






EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034